క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 8న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కొత్తూరు జెండా, కొత్తూరు మార్కెట్ వెనుక వైపు, తోటబడి, భగత్‌సింగ్ కాలనీ, గోపాల్‌రావు బిల్డింగ్, హనుమాన్ నగర్, యాదవనగర్, లోటల్ కాలనీ, మైత్రి వనం , విల్లాస్, ప్రకాశ్‌రెడ్డి పేట, జులైవాడ, గణేష్ నగర్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే, వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు గురువారం అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. చింతల్, ఆదర్శనగర్, తూర్పు కోట, మధ్య కోట, పశ్చిమ కోట, వసంతాపూర్, దూపకుంట, ఆరెపల్లి, కొత్తపేట, మొగిలిచర్ల, హంటర్ రోడ్డు, రామన్నపేట, బొందివాగు, రామా టాకీస్, పాత బీట్ బజార్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కలెక్టరేట్‌లో చలివేంద్రం ప్రారంభం



హన్మకొండ అర్బన్: హనుమకొండ కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కలెక్టర్ ప్రావీణ్య బుధవారం ప్రారంభించారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వేసవి కాలం దృష్ట్యా కలెక్టరేట్‌కు వచ్చే ప్రజల సౌకర్యార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. డీఆర్‌ఓ వైవీ.గణేష్, డీఆర్‌డీఓ మేన శ్రీను, అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

రవీంద్రనాథ్ ఠాగూర్‌కు నివాళి



హన్మకొండ చౌరస్తా: జాతీయ గీత రచయిత, నోబెల్ అవార్డు గ్రహీత రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతిని పురస్కరించుకుని 5వ డివిజన్‌లోని హనుమాన్ నగర్ ఫేజ్ –1 కాలనీ కమిటీ ఆధ్వర్యంలో ఠాగూర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకుడు చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ భారతదేశ ఔన్నత్యాన్ని జనగణమన గేయ రూపంలో ప్రపంచానికి చాటిన గొప్ప కవి రవీంద్రనాథ్ ఠాగూర్ అని కొనియాడారు. కార్యక్రమంలో మొట్ల మనోహర్, మాదారపు ఉదయ్‌కిరణ్, రాజ్‌కుమార్, వెంకటేష్, రవి, కిరణ్, సందీప్, చిరంజీవి పాల్గొన్నారు.

మాజీ సీఎం సంజీవయ్యకు నివాళి



కాజీపేట రూరల్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దామోదర్ సంజీవయ్య వర్ధంతిని కాజీపేట బాపూజీనగర్ సెంటర్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మైసారపు సిరిల్‌లారెన్స్, ఇప్ప శ్రీకాంత్, సిలువేరు విజయభాస్కర్, మధు, తిరుపతి, శ్రీనివాస్ బొబ్బిలి, నాగరాజు, అలీంబాయ్, పోగుల శ్రీనివాస్, దార్ల రాజ్‌కుమార్, మాతంగి స్వామి, భద్రయ్య, డీసీ.మౌళి, దుప్పటి శరత్, ప్రభాకర్, అశోక్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం




హన్మకొండ చౌరస్తా: హనుమకొండలోని 10వ డివిజన్ పరిధిలోని లెప్రసీ కాలనీలో రూ.5 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు కావాల్సిన వసతులను కల్పించడమే తమ లక్ష్యమన్నారు. త్వరలోనే లెప్రసీకాలనీలో సైడ్ డ్రెయినేజీ నిర్మాణం, నీటి వసతి కోసం బోరింగ్ వేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ డి.హరి, కాంగ్రెస్ పార్టీ 10వ డివిజన్ అధ్యక్షుడు శోభనబోయిన కుమార్ యాదవ్, నాయకులు మంద రాకేష్‌పటేల్, నల్లతీగల ఎల్లయ్య, బొంత రామకృష్ణ, కాంట్రాక్టర్ తోట నాగరాజు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది కలగొద్దు

న్యూశాయంపేట: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బంది రాకుండా చూడాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు కోరారు. ఈమేరకు వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారదను బుధవారం కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్, ఒదెల రాజయ్య, అంబయ్య, సిరుల రవీందర్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వెలగని వీధి దీపాలు

- రాఘవేంద్రనగర్ -2లో అంధకారం
- ఐదు రోజులుగా చీకట్లతో ఇబ్బంది పడుతున్న స్థానికులు



వెలగని రాఘవేంద్రనగర్ -2లోని వీధి లైట్



స్తంభానికి వెలగని వీధి దీపం, వీధి దీపంలా కనిపిస్తున్న చంద్రుడు

హన్మకొండ: వరంగల్ మహానగర పాలక సంస్థ 58వ డివిజన్ హనుమకొండలోని రాఘవేంద్రనగర్ -2లో ఐదు రోజులుగా వీధి దీపాలు వెలుగక అంధకారం నెలకొంది. చీకట్లో ఇబ్బంది పడుతున్నా వరంగల్ మహానగర పాలక సంస్థ అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. కాలనీలో కుక్కల బెడద ఉందని, చీకట్లో వెళ్తున్న వారిపై అవి వెంటపడి దాడి చేస్తున్నాయని వాపోయారు. ఐదు రోజులుగా వీధి లైట్లు వెలగకున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు వీధి దీపాలు వెలిగేలా చూడాలని పలువురు కోరారు.

టైలరింగ్‌తో ఉపాధి అవకాశాలు



మహిళలకు మగ్గం కిట్స్ అందిస్తున్న అతిథులు

హన్మకొండ: టెక్స్‌టైల్స్, టైలరింగ్ రంగంలో మహిళలకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని కాకతీయ విశ్వవిద్యాలయ పాలక మండలి సభ్యురాలు, అనురాగ్ హెల్పింగ్ హ్యాండ్ అధ్యక్షురాలు కరుకాల అనితారెడ్డి అన్నారు. ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ, హనుమకొండ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ సమ్మయ్యనగర్‌లో మహిళలకు ఉచిత మగ్గం శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్లు బత్తుల కరుణ, ఎర్ర శ్రీకాంత్ మాట్లాడుతూ శిక్షణ ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో వయోవృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రిటైర్డ్ డీఎస్పీ దామెర నర్సయ్య, సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ బాధ్యులు తేరాల యుగంధర్, శ్రీకాంత్, ఇన్‌స్ట్రక్టర్ లత, కమ్యూనిటీ మొబిలైజర్ రజిని, మహిళలు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి



మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్ రావు

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

హన్మకొండ: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా చాటాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. హసన్‌పర్తి మండలంలోని 15 గ్రామ పంచాయతీలకు చెందిన బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం హనుమకొండ రాంనగర్‌లోని ఆయన స్వగృహంలో జరిగింది. ఈ సందర్భంగా దయాకర్‌రావు మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతీ నాయకుడు, కార్యకర్త కష్టపడాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో భ్రమలు పోయాయని ఆరోపించారు. ఎన్నికల హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కాంగ్రెస్ పట్ల ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లిందని, ఈక్రమంలో వారు బీఆర్‌ఎస్, కేసీఆర్ వైపు చూస్తున్నారన్నారు. సమావేశంలో నాయకులు బండి రజనీకుమార్, రఘు, భగవాన్ రెడ్డి, సాగర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, సాంబరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

‘ఆపరేషన్ సిందూర్’ను స్వాగతిస్తున్నాం



సంబురాలు చేసుకుంటున్న ఏబీవీపీ నాయకులు

హన్మకొండ అర్బన్ / విద్యారణ్యపురి: పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారకంగా పాక్ ఆక్రమిత కశ్మీర్, పాకిస్తాన్‌లోని ఉగ్రవాదుల స్థావరాలపై భారత సైన్యం చేపట్టిన ‘ఆపరేషన్ సిందూర్’ను స్వాగతిస్తున్నట్లు ఏబీవీపీ నాయకులు తెలిపారు. ఈమేరకు బాలసముద్రంలోని సామ జగన్మోహన్ భవనం వద్ద బాణసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యసమితి సభ్యుడు ఆరెపల్లి సుజిత్ బుధవారం మాట్లాడుతూ పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి సిగ్గుచేటని విమర్శించారు. ఆపరేషన్ సిందూర్‌తో భారతీయులు గర్విస్తున్నారని తెలిపారు. ఇలాగే, ఉగ్రవాదులం దరికీ మట్టుబెట్టేందుకు భారత సైన్యానికి, కేంద్ర ప్రభుత్వానికి యావత్ భారతదేశం పూర్తిగా మద్దతుగా నిలబడాలని కోరారు. కార్యక్రమంలో వరంగల్ మహానగర్ కార్యదర్శి తాళ్లపల్లి అరుణ్, ఏబీవీపీ నాయకుల హరిచరణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రిస్టియన్ ఫెలోషిప్ శాంతి ర్యాలీ



శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

హన్మకొండ చౌరస్తా: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఇటీవల జరిగిన ఉగ్రదాడిలో మృతిచెందిన అమరులు, అలాగే, బ్రదర్ ప్రవీణ్ పగడాల సంస్మరణార్థం బుధవారం సాయంత్రం గ్రేటర్ వరంగల్ క్రిస్టియన్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. క్రిస్టియన్ ఫెలోషిప్ చైర్మన్ బిషప్ డానియల్ కల్యాణపు ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీ హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్ నుంచి అంబేడ్కర్ విగ్రహం మీదుగా కాళోజీ జంక్షన్, అమర వీరుల స్తూపం, కలెక్టరేట్ కార్యాలయం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా పహల్గాం అమరుల కుటుంబ సభ్యులకు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. గుర్తుతెలియని వ్యక్తులతో హత్యకు గురైన ప్రవీణ్ కుటుంబానికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం సందర్శన



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న సంతోష్ రెడ్డి

కాజీపేట: కాజీపేట మండలం సోమిడి గ్రామ శివారులోని ఐకేపీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు జరుగుతున్న తీరు, రైతులకు నగదు అందుతున్న విధానంపై నిర్వాహకులతో చర్చించారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. పీఏసీఎస్ డైరెక్టర్ కాయిత రాజుకుమార్ యాదవ్ ఆధ్వర్యంలో యాదవ కుల సంఘం అధ్యక్షుడు కాయిత పెద్దగొల్ల బాలరాజు యాదవ్‌తో పాటు సభ్యులు బీజేపీలో చేరారు. ఈమేరకు వారిని పార్టీలోకి సంతోష్ రెడ్డి ఆహ్వానించారు. కాయిత జంగం రాజు, మేకల శ్రావణ్ కుమార్ యాదవ్, చిర్ర నర్సింగ్ గౌడ్, భగవాన్ దాసు ఉపాధ్యాయ, సంద్ర మధు, బోయిని రాజ్‌కుమార్, శ్యామ్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

దర్గా విద్యార్థులకు నగదు పురస్కారం



విద్యార్థులతో ఉపాధ్యాయులు, సొసైటీ సభ్యులు

కాజీపేట రూరల్: కాజీపేట దర్గా ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులు ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించారని హెడ్‌మాస్టర్ ఎస్ఎం .స్వామి తెలిపారు. ఈమేరకు టాపర్లుగా నిలిచిన టి.అవినాష్, జి.శివాంజలి, డి.చరణ్, సీహెచ్.సుగాత్రి, పి.సౌమ్యకు రిటైర్డ్ ప్రొఫెసర్ కేశవరావు, సాఫ్ట్‌వేర్ ఇంజినీరు బొల్లిపా సాదుశోబాబు రూ.10 వేల నగదు పురస్కారాలు అందజేశారు. సామాజిక కార్యకర్త బోయ చందు రూ.3,500ల విలువ చేసే బ్యాగులను పంపిణీ చేశారు. ఆంగ్లంలో అధిక మార్కులు సాధించిన ఇద్దరు టాపర్లకు ఉపాధ్యాయురాలు ఎం.సుమలత రూ.వేయి అందజేశారు. కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ కటుకూరి శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఎం.సుమలత, బి.సతీష్‌పాల్, ఎస్.రాజు, రాంగోపాల్ పాల్గొన్నారు.

వాసవీమాత జయంతి

ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీమాత జయంతి వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవిమాత విగ్రహంతో పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మంచాల కృష్ణమూర్తి, విమల, రాధిక, కృష్ణవేణి, మంచాల రాణి, శైలజ, త్రివేణి పాల్గొన్నారు.

హసన్‌పర్తిలో కుంకుమ పూజలు

హసన్‌పర్తి: వాసవీమాత జయంతి వేడుకలను వాసవి క్లబ్ ఆధ్వర్యంలో హసన్‌పర్తి మండల కేంద్రంలోని లక్ష్మీ ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమ పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ చకిలం రాజేశ్వర్‌రావు, క్లబ్ అధ్యక్షుడు సంద్రు నాగేందర్, కార్యదర్శి పురవర్ధన్, కోశాధికారి నాగమళ్ల మాధవ శంకర్, జిల్లా జాయింట్ సెక్రటరీ శంకర్, వాసవి క్లబ్ మాజీ అధ్యక్షుడు గౌరిశెట్టి కృష్ణమూర్తి, భీష్మనాథం, లక్ష్మణ్, చిదర కరంచంద్, శ్యాంసుందర్, ఆర్యవైశ్య సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలు జ్యోతి, సభ్యులు నిరోషా, కట్కూరి రాధ, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాల స్వామి ఆలయంలో అన్నదానం



రామన్నపేట: వాసవీమాత జయంతి సందర్భంగా వేణుగోపాల స్వామి దేవాలయంలో గురుస్వామి మహేష్ ఆధ్వర్యంలో గోపాలస్వామి గుడి బస్టాప్ వద్ద బుధవారం అన్నదానం, మజ్జిగ పంపిణీ చేసినట్లు ఆర్యవైశ్య సంఘం నాయకులు తెలిపారు. కార్యక్రమంలో అకినపల్లి సత్యనారాయణ, బెజగం రజినీకాంత్, తోట నవీన్ కుమార్, ఎలగందుల రమేష్, కుంచం బద్రి, దివ్వెల శ్రీనివాస్, నాగరాజు, పనేష్, రాజన్న, శ్రీనివాస్, సర్వేశ్వర్ రావు, ఓలం రాజేంద్రప్రసాద్, నరేష్ పాల్గొన్నారు.

‘సీఎం వ్యాఖ్యలు సరికాదు’

న్యూశాయంపేట: ఉద్యోగులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు సరికాదని (ఉద్యోగ సంఘాల పోరాట కమిటీ) యూఎస్‌పీసీ వరంగల్ జిల్లా నాయకులు అన్నారు. ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ జిల్లా శాఖ సమావేశాన్ని వరంగల్‌లోని టీఎస్‌యూటీఎఫ్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సీఎం, మంత్రులు, అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఈ సమావేశంలో నాయకులు అశోక్, నరసింహులు, ఆనందచారి, నరసింహచారి, సదానందం తదితరులు పాల్గొన్నారు.

పంట మార్పిడితో అధిక దిగుబడి



బ్రోచర్ విడుదల చేస్తున్న అతిథులు

హసన్‌పర్తి: పంట మార్పిడితో అధిక దిగుబడి పొందవచ్చని సీనియర్ శాస్త్రవేత్త సతీష్‌చంద్ర సూచించారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్త అనే కార్యక్రమంలో భాగంగా హసన్‌పర్తి రైతు వేదికలో బుధవారం జరిగిన సమావేశంలో రైతులకు ఆయన పలు సూచనలు చేశారు. సాగులో యూరియా వాడకాన్ని తగ్గించుకోవాలని, అధిక రసాయనాల వాడకం వల్ల నేల దెబ్బతింటుందని తెలిపారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వరిసాగులో తీసుకోవాల్సిన మెళకువలు, జాగ్రత్తల గురించి వివరించారు. ఉద్యానశాఖ అధికారి సుష్మిత మాట్లాడుతూ ఉద్యానశాఖ ద్వారా అందజేస్తున్న సబ్సిడీ పథకాల గురించి వివరించారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం బ్రోచర్‌ను విడుదల చేశారు. సమావేశంలో కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, మండల వ్యవసాయాధికారి అనురాధ, పశువైద్యాశాఖ అధికారి మాళవిక, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, రైతులు మారపల్లి రాంచంద్రారెడ్డి, కర్ణాకర్ రెడ్డి, రాజిరెడ్డి, గౌరె కిరణ్ పాల్గొన్నారు.

12న ఓంకార్ శతజయంతి వార్షికోత్సవం



సభ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

హన్మకొండ: మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటయోధుడు మద్దికాయల ఓంకార్ శత జయంతి వార్షికోత్సవ సభను విజయవంతం చేయాలని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సభ్యుడు గడ్డం నాగార్జున పిలుపునిచ్చారు. హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వార్షికోత్సవ సభ కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 12న వరంగల్ జిల్లా మచ్చాపూర్‌లో 125 అడుగుల ఓంకార్ స్మారక స్తూపాన్ని పునః ప్రారంభించనున్నట్లు తెలిపారు. అదేరోజు ఓంకార్ శతజయంతి వార్షికోత్సవ సభ నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రజాసేవకు తన జీవితాన్ని ఓంకార్ అంకితం చేశారని గుర్తుచేశారు. తెలంగాణ రైతాంగ పోరాటాన్ని ముందు వరుసలో ఉండి నడిపిన మహోన్నతమైన కమ్యూనిస్టు అని అన్నారు. నిస్వార్థంగా లక్షలాది ఎకరాల భూములను పేదలకు పంచారని పేర్కొన్నారు. 1984లో ఎంసీపీఐని స్థాపించి దేశవ్యాప్తంగా పార్టీని వ్యాప్తింప చేసి, 2006లో ఎంసీపీఐ(యూ)గా ఏర్పాటు చేశారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చీపురు ఓదయ్య, మొగిలి శ్రీనివాసరావు, అన్నబోయిన ప్రేమలత, పోకల సుధీర్, విజయ్, అనిత, దేవి, యూసుఫ్, అరుణ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

13నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, మాలధారులు

హన్మకొండ అర్బన్: నగరంలోని పద్మాక్షి కాలనీలోని హనుమద్గిరి ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో ఈనెల 13నుంచి 22వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు ఆరుట్ల రామాచార్యులు తెలిపారు. ఈమేరకు ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ సభ్యులు బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామాచార్యులు మాట్లాడుతూ 13న గణపతి పూజ, పుణ్యాహవచనం, మండపారాధన, 14న సీతారామచంద్ర స్వామి వారికి కలశాలతో అష్టోత్తర శతకటాభిషేకం, 19న అఖండ రామనామ పారాయణం, 20న సామూహికంగా హనుమాన్ చాలీసా పారాయణం, 21న హనుమాన్ మాలధారులతో శోభాయాత్ర, 22న హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకం, చందన సేవ, అలంకరణ, అర్చనలు నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు గందె కృష్ణ, ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల రవికుమార్, దశరథ్ కుమార్, గంద్రతి సుధాకర్, శంకర్, మొగులయ్య, సమ్మయ్య పాల్గొన్నారు.

15నుంచి ఏఐవైఎఫ్ మహాసభలు



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖిలా వరంగల్: ఈనెల 15 నుంచి 18వ తేదీ వరకు తిరుపతిలో జరగనున్న ఏఐవైఎఫ్ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వలీఉల్లాఖాద్రీ పిలుపునిచ్చారు. వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో మహాసభల వాల్‌పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతిలో అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) 17వ జాతీయ మహాసభలు జరగనున్నాయని తెలిపారు. ఈ మహాసభలకు 29 రాష్ట్రాల నుంచి 100 మందికి పైగా యువజన ప్రతినిధులు హాజరు కానున్నారని చెప్పారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న యువజన వ్యతిరేక విధానాలు, రాజకీయాలు, నియంతృత్వ కార్పొరేట్ విధానాలు, విద్యా, వైద్యం, ఉపాధి హక్కుల కోసం, సామాజిక, ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక విలువలు వంటి అంశాలపై మహా సభలో చర్చించనున్నామని వివరించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మస్కా సుధీర్, హసీనా, విజయ్, కిరణ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

చొరబాటుదారులను గుర్తించాలి

హసన్‌పర్తి: మండల పరిధిలో అక్రమంగా నివసిస్తున్న పాకిస్తానీయులు, బంగ్లాదేశ్‌కు చెందిన రోహింగ్యాలు, అరబ్ దేశాల నుంచి అక్రమంగా చొరబడిన విదేశీలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ కోరారు. ఈమేరకు నాయబ్ తహసీల్దార్ రహీంకు బుధవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మారపల్లి రాంచంద్రారెడ్డి, బీజేపీ వరంగల్ పార్లమెంటరీ కన్వీనర్ తాళ్లపల్లి కుమారస్వామి, బీజేపీ మండల అధ్యక్షుడు తిరుపతి, దేవస్థాన మాజీ చైర్మన్ పెద్దమ్మ శ్రీనివాస్, బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు చంద్రమౌళి, మహిళా మోర్చా నాయకురాలు ఉమ పాల్గొన్నారు.

కల్యాణోత్సవాన్ని విజయవంతం చేయాలి

కాజీపేట: భద్రకాళి అమ్మవారి సన్నిధిలో శుక్రవారం కౌండిన్య గౌడ జన బంధువుల ఆధ్వర్యంలో జరగనున్న కల్యాణ మహోత్సవాలను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ గౌడ్ పిలుపునిచ్చారు. కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్ నగర్ కాలనీలో గౌడ సంఘాల నాయకులతో కలిసి బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆహ్వాన పత్రికలను విడుదల చేశారు. సమావేశంలో బోనగాని యాదగిరి గౌడ్, జనగాం శ్రీనివాస్, పులి మోహన్, మారగోని రవీందర్, దూలం రాజు, ఎరుకొండ రమేష్ పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

ఖిలా వరంగల్: ఈనెల 20న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను కార్మికులు జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ పిలుపునిచ్చారు. వరంగల్ ఫోర్ట్‌రోడ్డులోని సామిల్ అండ్ టింబర్ డిపో యాజమాన్యానికి బుధవారం సమ్మెనోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లను ముందుకు తీసుకొచ్చిందని ఆరోపించారు. కొత్త లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మిక వర్గాన్ని బానిసత్వంలోకి నెట్టి వేయాలని చూస్తోందన్నారు. ఏఐటీయూసీ జిల్లా ప్రతినిధులు తాళ్లపల్లి జాన్‌పాల్, రాజకుమార్, బాబు, యాకోబు, ఇస్మాయిల్, భిక్షపతి, పట్టల శ్రీను, సాంబయ్య, యాకయ్య, స్వామి, వెంకన్న పాల్గొన్నారు.

జీఎంహెచ్ సూపరింటెండెంట్‌కు సమ్మె నోటీస్

హన్మకొండ చౌరస్తా: హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మికి సమ్మె నోటీస్‌ను సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకురావాలనుకుంటున్న నాలుగు కార్మిక కోడ్‌లకు వ్యతిరేకంగా ఈనెల 20న దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మె చేపట్టనున్నట్లు తెలిపారు. ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న పోస్టులను ప్రస్తుతం పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగ, కార్మికులతో భర్తీ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు అనిల్, కళావతి, కోమల, రజిత, సబీర, పుష్ప, సంధ్య, సదానందం, కర్ణాకర్, రమాదేవి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

డీఈఓకు సమ్మెనోటీస్ అందజేత

విద్యారణ్యపురి: కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్‌లను రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని కోరుతూ ఈనెల 20న జరగనున్న సమ్మెలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు పాల్గొనాలని తెలంగాణ మధ్యాహ్నం భోజన కార్మికుల యూనియన్ (సీఐటీయూ) జిల్లా కన్వీనర్ రజిత కోరారు. ఈమేరకు హనుమకొండ జిల్లా డీఈఓ వాసంతికి మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మెనోటీస్‌ను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా రజిత మాట్లాడుతూ 25ఏళ్లుగా కార్మికులు పనిచేస్తున్నప్పటికీ కనీసవేతనం అమలు కావడం లేదని పేర్కొన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొట్ల చక్రపాణి, యూనియన్ జిల్లా కార్యదర్శి శాంత పాల్గొన్నారు.

సీకేఎం ఆస్పత్రిలో అబార్షన్ కేర్ శిక్షణ శిబిరం

ఎంజీఎం: వరంగల్ సీకేఎం ఆస్పత్రిలో ప్రాథమిక వైద్యాధికారులకు కొనసాగుతున్న అబార్షన్ కేర్ శిక్షణ శిబిరాన్ని డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్ఎంఓ మురళితో కలిసి ఆస్పత్రి పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం గీసుగొండ పీహెచ్‌సీ పరిధిలోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు, ధర్మారం , ఊకల్, పీహెచ్‌సీలతో పాటు సంగెంలో పర్యటించి వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు.

వరంగల్ రైల్వేస్టేషన్‌లో తనిఖీలు

ఖిలా వరంగల్: వరంగల్ రైల్వేస్టేషన్‌లో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ పి.సురేందర్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి తనిఖీలు చేశారు. రైల్వేస్టేషన్‌లోని ప్రయాణికుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనుమానాస్పదంగా కనిపించిన వారి బ్యాగులను జీఆర్పీ పోలీసులు పరిశీలించారు. నిషేధిత గంజాయి, మత్తు పదార్థాలు తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు.

పోగొట్టుకున్న మొబైల్‌ఫోన్ల అప్పగింత

ఖిలా వరంగల్: వరంగల్ రైల్వేస్టేషన్ పరిధిలో ప్రయాణికులు తమ మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్నారు. ఈమేరకు ఆరుగురు బాధితులు సీఈఐఆర్ పోర్టల్ ఫిర్యాదు చేయగా.. ఇటీవల జీఆర్పీ పోలీసులు ఆ ఫోన్లను రికవరీ చేశారు. సుమారు రూ.1.40 లక్షల విలువైన మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని బాధితులకు జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ పి.సురేందర్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ సుందర్శన్, కానిస్టేబుల్ డి.రాము, ఎండీ.రియాజుద్దీన్ పాల్గొన్నారు.

సాహితీ రంగాన్ని ప్రోత్సహిస్తా..

హన్మకొండ కల్చరల్: సాహితీ రంగాన్ని ప్రోత్సహిస్తానని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య అన్నారు. హనుమకొండలోని అంబేడ్కర్ సెంటర్ సమీపంలోని స్వగృహంలో సాహిత్య కల తీరుతెన్నుల వైభవాలపై నగరంలోని పలువురు కళాకారులతో బుధవారం చర్చించారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు బన్న అయిలయ్య, పొట్లపల్లి శ్రీనివాస్‌రావు, గిరిజ మనోహర్‌బాబు, చందు, వీఆర్ విద్యార్థి, మంతెన శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగుతూ పోలీసులకు చిక్కారు

హసన్‌పర్తి: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న 30మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. విధుల్లో భాగంగా కాకతీయ యూనివర్సిటీ పోలీస్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో గోపాలపురం, యాదవ నగర్ ప్రాంతాల్లో బుధవారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలపురం జంక్షన్ వద్ద బహిరంగంగా మద్యం తాగుతున్న ఎనిమిది మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అలాగే, గోపాలపురం చెరువు కట్ట వద్ద మరో ఎనిమిది మందిని, యాదవ నగర్ పెగడపల్లి డబ్బాల ప్రాంతంలో పదకొండు మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా వారిని అరెస్ట్ చేసినట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు. దాడుల్లో ఎస్సైలు రవీందర్, శ్రీకాంత్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.